క్లుప్తంగా

వలంటీర్ల సేవలు మరువలేనివి



వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మక్కువ: వలంటీర్ల సేవలు మరువలేనివని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసనాయుడు ప్రశంసించారు. ఈ మేరకు మంగళవారం మక్కువ మండలం కవిరిపల్లిలో శంబర, శీబిల్లిపెద్దవలస, చెముడు తదితర గ్రామాల వలంటీర్లకు సన్మానం నిర్వహించారు. ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తున్న వలంటీర్లకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీవో దేవకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఈఎంఓగా మణికంఠేష్



విధుల్లో చేరిన మణికంఠేష్

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఏనుగుల సంరక్షణ బాధ్యతలు చూసేందుకు మానిటరింగ్ అధికారి (ఈఎంఓ)గా కె.మణికంఠేష్‌కు బాధ్యతలు అప్పగించామని డీఎఫ్ఓజీఏపీ ప్రసూన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం కార్యాలయంలో విధుల్లో చేరినట్లు చెప్పారు. గుంటూరుకు చెందిన ఆయన గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేశారు. అనంతరం ఏపీపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఇక్కడే ఏఆర్ఓగా శిక్షణ తీసుకుని, ప్రస్తుతం రేంజర్‌గా ఉద్యోగంలో చేరారు.

విద్యుత్ కోతలు లేవు



ఎలక్ట్రికల్ ఏఈ రామారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి విద్యుత్ కోతలు లేవని ఎలక్ట్రికల్ ఏఈ రామారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎటువంటి విద్యుత్ కోతలను విధించడం లేదని తెలిపారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అయినప్పటికీ విద్యుత్‌శాఖ సిబ్బంది సకాలంలో స్పందించి మరమ్మతులు త్వరితగతిన చేపట్టి విద్యుత్ సరఫరాను యథావిధిగా పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్న విద్యుత్ కోతల కథనాలు అవాస్తవమని అటువంటి వాటిని నమ్మవద్దని కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయ భేరికి నాలుగేళ్లు

సీతానగరం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయ భేరి మోగించి నేటికి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా పార్టీ కార్యకర్తలు అభిమానులు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ద్వారా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ మంగళవారం ప్రజల సమక్షంలో కేక్ కట్ చేశారు. కేక్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులకు పంచిపెట్టారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ పార్టీకి పట్టుకొమ్మల్లా పని చేస్తున్న కార్యకర్తలు, అభిమానుల విజయం ఇదిఅన్నారు.ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు జగనన్న నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

- ఎంపీపీ బి. ప్రమీల



వలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల, ప్రజాప్రతినిధులు

పాచిపెంట: వలంటీర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఎంపీపీ బి. ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కేసలి, పద్మాపురం, కొటికిపెంట, పాచిపెంట-1,2 వలంటీర్లకు సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ బి. ప్రమీల మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పార్టీలకతీతంగా అవినీతి లేకుండా సంక్షేమ పాలన కొనసాగుతోందంటే ఆ గొప్పతనం వలంటీర్లదేనని ప్రశంసించారు. వలంటీర్ వ్యవస్థను సృష్టించి ఇంత మంచి అవకాశాన్ని కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంతవరకు వలంటీర్లు ప్రజలకు సేవలు అందించారని, ఇక నుంచి మీ సేవలు పార్టీకికూడా అవసరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, పార్టీమండల అధ్యక్షుడు ముత్యాల నాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్ర ఎంపీడీవో ఉమామహేశ్వరి, కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ మజ్జి వెంకటరావు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

భళా బాలికా..!

- పాఠశాల నుంచి ఐఐఐటీవైపు అడుగులు
- సత్తా చాటుతున్న జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల



విద్యార్థులను అభినందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇన్‌చార్జ్ జేసి విష్ణుచరణ్, ఎమ్మెల్యేలు, అధికారులు

సాలూరు: ఐఐఐటీలో సీటు సాధించాలంటే అది కార్పొరేట్ విద్యాసంస్థలో చదివితేనే సాధ్యమవుతుంది. లక్షల రుపాయలు స్కూల్, హాస్టల్ ఫీజులు చెల్లించగలిగే గొప్పవారి పిల్లలే చాలావరకు ఆ సీట్లు సాధిస్తుంటారు వాటికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఉంటాయి అంటూ మనం అక్కడక్కడ విన్న పరిస్థితులు ప్రజలందరికీ తెలుసు. అది గతం. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పరిస్థితి మారింది. నాడు నేడుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మార్చిన జగన్‌మోహన్‌రెడ్డి, విద్యార్థులకు ప్రతిభ ఉంటే ఎక్కడైనా సీట్లు సాధించగలరని రుజువు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడంతో పాటు ఐఐఐటీలో సీట్లు పొంది ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటుతున్నారు. ఇటువంటి కోవలోకే వస్తుంది సాలూరు పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల. ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడంతో పాటు ఐఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సంపాదిస్తూ ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటుతున్నారు. ఇటీవల జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డు)కు ఎంపికయ్యారు.

- 2020-21 విద్యాసంవత్సరంలో 50 మంది విద్యార్థినులు పదవ పరీక్షలు రాసి శతశాతం ఉత్తీర్ణత సాధించగా, ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. ఓ విద్యార్థిని 10/10 జీపీఏ సాధించింది.
- 2021-22 విద్యాసంవత్సరంలో 74 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 73మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 33 మంది 500కు పైగా మార్కులు సాధించడంతో పాటు 6గురు విద్యార్థినులు ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించారు.
- "2022-23 విద్యాసంవత్సరంలో 76 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 72 మంది ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులు కాగా 500 పైగా మార్కులను 37 మంది సాధించారు. పలువురు విద్యార్థినులు ఐఐఐటీ సీట్లు సాధించే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ మూకల పెంటయ్య చెబుతున్నారు.



కర్రి షర్మిల, విద్యార్థిని



దమరసింగి లత, విద్యార్థిని

జగనన్న ఆణిముత్యాలుకు విద్యార్థినుల ఎంపిక

పాఠశాల విద్యార్థిని కర్రి షర్మిల 585 మార్కులు సాధించి ఎంజేబీ పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం, జిల్లా, నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమె రాష్ట్రస్థాయి ఆణిముత్యాలు అవార్డు ఎంపిక కావడంతో బంగారుపతకం, రూ.50వేల నగదు, జిల్లా ప్రథమ స్థానానికి గాను బంగారుపతకం రూ.50 వేల, నియోజకవర్గానికి గాను రూ.15 వేల నగదు ప్రోత్సాహకం అందుకోనుంది.

- ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థిని తెంటు యామిని 581 మార్కులతో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించడంతో రజత పతకం రూ.30వేల నగదు, నియోజకవర్గ స్థాయిలో ద్వితీయస్థానంతో రజతపతకం, రూ.10 వేల నగదు ప్రోత్సాహకాలను అందుకోనుంది.
- పాఠశాలకు చెందిన దమరసింగిలత 574 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో తృతీయస్థానంతో కాంస్యపతకం రూ.15 వేల నగదు ప్రోత్సాహకం అందుకోనుంది.
- వీరికి ఈ నెల 25న నియోజకవర్గస్థాయిలో, 27న జిల్లాస్థాయిలో , 31న రాష్ట్రస్థాయిలో జగనన్న ఆణిముత్యాలు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

చాలా ఆనందంగా ఉంది



పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించి, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో సీట్లు పొందడం చాలా సంతోషంగా ఉంది. కలెక్టర్, ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, ప్రజాప్రతినిధుల ఆదేశాలు, సూచనలు, సలహాలు పాఠశాల నుంచి ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడుతున్నాయి.

– మూకల పెంటయ్య, ప్రిన్సిపాల్, మహాత్మాజ్యోతిబాపూలే బీసీ సంక్షేమగురుకుల పాఠశాల, సాలూరు

ఘనంగా పెంటపోలమ్మ ఉత్సవం



పెంటపోలమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని వెంగాపురం పెంటపోలమ్మ తల్లి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఇంటివద్దకు చేరుకుని పూజ చేసి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రజలు సిరి, సంపదలు, ఆయురారోగ్యాలతో ఉండేలా అందరినీ చల్లగా చూడాలని కోరుకున్నారు. గ్రామంలో పెంటపోలమ్మ ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఘటాలను ఊరేగించి దివిటీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులను తీర్చుకున్నారు. కొంతమంది భక్తులు ఘటాలను ఇంటివద్ద తయారుచేసుకుని అమ్మవారి సన్నిధి వరకు వాటిని తలపై పెట్టుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. తెల్లవారు జామునుంచి అమ్మవారి ఇంటివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. పూజారి గోపినాయుడు అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గోపాలపురంలో గ్రామ దేవత దర్శనం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మండలంలోని గోపాలపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ కొత్త పొలమ్మ, పాత పోలమ్మ అమ్మవార్ల గ్రామ దేవత పండుగ ఉత్సవాలకు గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు మంగళవారం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జోగారావు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ప్రజలందరికీ గ్రామ దేవత పండగ శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.స్రవంతి, రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇ.సూర్యనారాయణ, పి భానుప్రకాష్, ఎస్.ప్రకాష్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నోవరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలు శ్మశానంతో పోల్చడం హాస్యాస్పదం



మాట్లాడుతున్న గొంప ప్రకాశరావు

సాలూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను టీడీపీ నాయకుడు చంద్రబాబునాయుడు శ్మశానంతో పోల్చడం హాస్యాస్పదంగా ఉందని రిపబ్లికన్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప ప్రకాశరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరులో మాట్లాడుతూ, అమరావతిలో సెంటు ధర కనీసం రూ.10 లక్షలకు పైగా ఉందన్న విషయాన్ని గుర్తించకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో వివిధ పథకాల ద్వారా పేదలకు లక్షలాది రుపాయలు అందిస్తున్నారని ప్రశంసించారు. సుమారు 36 లక్షల మందికి ఇళ్లు ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రజల వద్దకే పంపిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర నిబద్ధతతో ఈ కార్యక్రమాన్ని చేస్తున్నారని ప్రశంసించారు.

సంక్షేమ రథసారథులు వలంటీర్లు



సత్కరించిన వలంటీర్లతో ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సంక్షేమ రథసారథులు వలంటీర్లేనని ఎమ్మెల్యే జోగారావు ప్రశంసించారు. ఈ మేరకు పురపాలక సంఘంలో మంగళవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా టౌన్ ప్రాంతం పరిధిలో గల 5 వార్డు సచివాలయానికి సంబంధించి 10 వార్డులలో విశేష సేవలు అందిస్తున్న 76 మంది వార్డు వలంటీర్లకు పోలీస్ స్టేషన్ వీధిలో గల కల్యాణవేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు చేతుల మీదుగా వలంటీర్లు అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా సచివాలయాల వారీగా అందరికీ శాలువాలు కప్పి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించి వారి విశేష సేవా దృక్పథాన్ని అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ కె.రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, కమిషనర్ రామప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూ సారం



చాకరాపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: పచ్చిరొట్ట విత్తనాలను వినియోగించడం వల్ల భూసారం పెరుగుతుందని రసాయన ఎరువుల వినియోగం తగ్గించవచ్చని ఏఓ శ్రావణ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పి.చాకరాపల్లి గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాల వినియోగంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట విత్తనాలను భూమిలో వేసుకుని 45రోజుల లోపు లేదా పూత దశలో భూమిలో కలియదున్నాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల 9-10టన్నుల పచ్చిరొట్ట భూమికి అందడంతో భూసారం పెరిగి, ఉత్పాదక శక్తి ఎక్కువవుతుందని తెలిపారు. నేల గుల్లబారి చౌడు విరిగిపోతుందన్నారు. గాలిలో ఉండే నత్రజనిని స్థిరీకరిస్తాయని తెలిపారు. సూక్ష్మజీవుల అభివృద్ధి జరగడం వల్ల భూమిలో కలియదున్నడంతో 5నుంచి 10శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ సందర్శన



వనసంరక్షక్‌తో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా అంటిపేటలో ఉపాధి హామీ, సోషల్ ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతకు ప్రతిఇంటి ముందూ ఒక మొక్కను నాటాలని కోరారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే ఎవెన్యూ ప్లాంటేషన్ వేసినట్లు చెప్పారు. జగనన్న పచ్చతోరణం పథకం అమలులో భాగంగా గ్రామాల్లో మంచినీటి కోనేరు గట్లపై చెరువు సంరక్షణకు అవసరమైన నిధుల సేకరణకు ఫలజాతి, పూలజాతికి చెందిన మొక్కలు నాటినట్లు తెలిపారు. తాజాగా ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం కోసం నర్సరీలో మొక్కల పెంపకం చేపట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ టీఏ, క్షేత్ర సహాయకులు వనసంరక్షక్ చంటి పాల్గొన్నారు.

కృషితో ఏదైనా సాధ్యం

- అన్నదమ్ములను సత్కరించిన ఎమ్మెల్యే



ప్రేమచంద్, జయంత్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములు జాగాన ప్రేమచంద్, జయంత్ ఇటీవల ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించినందుకు వారిని గ్రామంలో ఈ మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ఉద్యోగాలు సంపాదించి కన్న తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం అందించిన అన్నదమ్ములు అభినందనీయులన్నారు. వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి ఎంతో శ్రమించి మంచి చదువు ఇప్పించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధా జగన్నాథ రావు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, మాజీ సర్పంచ్ సుభద్రమ్మ, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద తయారీతో గ్రామాలభివృద్ధి

పార్వతీపురం మన్యం జిల్లాలో
452 పంచాయతీలు
చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు **258**
నిర్మాణాల్లో ఉన్నకేంద్రాలు **197**



చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం



వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం



కాశీపేటలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు



పెదభోగిలిలో విక్రయానికి సిద్ధంగా ఎరువు

సీతానగరం: గ్రామాల్లో సేకరించిన తడి-పొడి చెత్తతో సంపద తయారుచేయడంతో గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దోహదపడతాయన్న సంకల్పంతో అన్నిగ్రామాల్లో ప్రభుత్వం ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు)లను ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 452 గ్రామ పంచాయతీలుండగా చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు 258 పని చేస్తున్నాయి. మరికొన్ని గ్రామాల్లో 197 చెత్తనుంచి సంపద తయారీకేంద్రాలు వివిధ స్థాయిల్లో నిర్మాణాల్లో ఉన్నాయి.

ప్రభుత్వం జిల్లాలో ప్రతి గ్రామంలో జనాభా ఆధారంగా చెత్త సేకరణకు మూడు చక్రాల రిక్షాలను సమకూర్చింది. ఈ రిక్షాల ద్వారా నిరంతరం ప్రభుత్వం గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో గౌరవ వేతనంపై గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. నిరంతరం ఉదయం పూట గృహిణులు తడిచెత్త, పొడిచెత్త వీధుల్లో వేయాల్సిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లు ఇళ్లముందుకు వచ్చి వాహనాల్లో వేస్తున్నారు. సేకరించిన చెత్తను వాహనాలతో గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలిస్తున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో తడిచెత్త, పొడి చెత్త, వ్యర్థ పదార్థాలు నిల్వ ఉంచడానికి కుండీలలో వేస్తున్నారు. కొన్ని కుండీలలో తడి చెత్త, పొడి చెత్తను ఎరువుగా తయారు చేయడానికి అవసరమైన ఎర్రలు పెంపకం చేసే కుండీలలో వేస్తున్నారు. సేంద్రియ ఎరువు తయారీ కోసం ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణ పొందిన వారంతా ఆయా గ్రామాల్లో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో మరికొంతమందికి చెత్తనుంచి సంపద తయారీపై అవగాహన కల్పిస్తుంటారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించడం వల్ల చెత్తశుద్ధి కేంద్రాల్లో తయారైన ఎరువుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎక్కువగా మహిళలు ఇళ్లముందు వేస్తున్న పూల మొక్కలు, కూరగాయలకు ఈ ఎరువును వినియోగిస్తున్నారు.

ప్రతి గ్రామంలో చెత్తశుద్ధి కేంద్రం ఏర్పాటుకు సిద్ధం

ఇళ్లలో పేరుకుపోయిన తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువు తయారీ కోసం కొంతమంది నిరుద్యోగులకు గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పర్యవేక్షణలో కూలీలకు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పొందిన వారు నిరంతరం (వర్మీ కంపోస్టు ఎరువు) సేంద్రియ ఎరువు తయారు కోసం సిబ్బంది సహకారంతో చెత్తనుంచి సంపద తయారు చేస్తోంది. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారు తయారుచేసిన ఎరువును గ్రేడింగ్ చేసి విక్రయాలు సాగిస్తున్నారు.

– బి.సత్యనారాయణ, డీపీఓ, పార్వతీపురం మన్యం జిల్లా

పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకుడికి మెమోలు



మాట్లాడుతున్న డీపీఓ బి సత్యనారాయణ

సీతానగరం: జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకం అమలు చేయడంలో విఫలమైన పెదభోగిలి పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి బి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం పెదభోగిలి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపన్నుల వసూలు, రికార్డులు సక్రమంగా లేవని, పన్నుల వసూలుతో వచ్చిన నిధుల జమా ఖర్చుల రికార్డులు సక్రమంగా లేని కారణంగా పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, ఇంటిపన్నుల రికార్డులు బాగాలేని కారణంగా జూనియర్ సహాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఇచ్చిన నోటీసులకు మూడు రోజుల్లోగా లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో విధులు నిర్వహించిన సిబ్బంది పనితీరును పరిశీలించారు.

అంగన్వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలి

- ఐసీడీఎస్ ప్రాంతీయసంయుక్త సంచాలకురాలు

పార్వతీపురం: అంగన్వాడీ కేంద్రాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఐసీడీఎస్ ప్రాంతీయసంయుక్త సంచాలకురాలు జి. చిన్మయి దేవి అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ పథకంలో పోషకాలు కలిగిన ఆహారాన్ని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు అందించే సేవలపట్ల నిర్వాహకులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరితో పాటు జిల్లాలోని సీడీపీఓలు, ఏసీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

పార్వతీపురం: సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన బోనెల ఆనంద్ పార్వతీపురంనుంచి చినభోగిలికి ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా మరిపివలస ముందు ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీ కొంది. ఈఘటనలో ఆటో తిరగబడిపోయింది. అయితే ఆటోలో ప్రయాణికుల ఎవరూ ఆ సమయంలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆటో నడుపుతున్న ఆనంద్‌కు పలుచోట్ల గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.